


www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

గురువారం | 10 | సెప్టెంబర్ | 2026 | పేజీలు: 08




# మాటిచ్చారు... నెరవేర్చండి

## వెయ్యి రోజులైనా నెరవేరని హామీ

### జర్నలిస్టుల ఆరోగ్య పథకం హామీని నెరవేర్చండి

### టీయూ డబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ



**ఆదిలాబాద్, అక్షిత ప్రతినిధి:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా, ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టులకు ఇచ్చిన ఆరోగ్య పథకం హామీని ఇంతవరకు నెరవేర్చకపోవడం విచారకరమని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జర్నలిస్టులకు ఆరోగ్య పథకాన్ని అమలు చేసి, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ కోరారు. బుధవారం నాడు ఆదిలాబాద్ పట్టణంలోని తరంగిణి ఫంక్షన్ హాలులో జరిగిన, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఆదిలాబాద్ జిల్లా మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో ఎనిమిదేళ్లుగా జేహెచ్ఎస్ పథకం అమలుకాకపోవడంతో అనారోగ్యాలకు గురవుతున్న జర్నలిస్టులు చికిత్స కోసం పడుతున్న తిప్పలు వర్ణనాతీతమని విరాహత్ అలీ ఆందోళన వ్యక్తం చేసారు. కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్స పొందే ఆర్థిక స్థోమత లేక, ఇప్పటికే వందల సంఖ్యలో జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయినట్లు ఆయన విచారం వ్యక్తం చేసారు. ఈ విషయాన్ని తాము పలుమార్లు ప్రభుత్వం ..మిగతా 2లో




# ఆడబిడ్డల నిశ్శబ్ద నరకం !

## కన్నీటి పయనం... బస్సు టికెట్ ఉచితం... మరి ఆత్మగౌరవం ??


### బస్టాండ్లలో కంపుకొడుతున్న మరుగుదొడ్లు

**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:** ఎర్రటి ఎండ... గొంతు పిడచకట్టుకు పోతున్నా ఆ తల్లి తన పసిబిడ్డకు గుక్కెడు మంచినీళ్లు తాగించదు... తనూ తాగదు.... ఎందుకో తెలుసా...?? "దారిలో బాత్రూమ్ వస్తే ఎక్కడికి వెళ్లాలి...??" అన్న భయం...!! సమాజం సిగ్గుతో తలదించుకోవాల్సిన అతి పెద్ద నిజం ఇది... ఉచిత ప్రయాణం పేరుతో మనం పంచుతున్నది సంతోషాన్ని కాదు... ప్రతిరోజూ లక్షలాది మంది తల్లులు, ఆడబిడ్డలు ..మిగతా 2లో

# సామాజిక తపస్వి... కాళోజీ

## కాళోజీ రచనలు స్ఫూర్తి దాయకం

### కాళోజీ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించి కలెక్టర్ డా.సత్య శారద




**వరంగల్, అక్షిత బ్యూరో:** ప్రజాకవి, తెలంగాణ వైతాళికుడు పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఘనంగా నివాళులర్పించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన గొప్ప ప్రజాకవి అని అన్నారు. తన రచనల ద్వారా ప్రజల సమస్యలను, వారి భావాలను ప్రతిబింబించిన ..మిగతా 2లో

# పొరపాట్లకు తావివ్వొద్దు

## పకడ్బందీగా ఎస్ఐఆర్ ప్రక్రియ

### అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చూడాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) ప్రక్రియను నిర్దేశిత గడువులోగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ భవన్లో ఎస్ఐఆర్ ప్రక్రియను సీఈవో సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, మృతులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు ..మిగతా 2లో



## సామాజిక తపస్వి... కాళోజీ



**మొదటి పేజీ తరువాయి...**

మహనీయుడిగా కాళోజీ చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు.తెలంగాణ భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కాళోజీ చేసిన సేవలు ఎనలేనివని అన్నారు. ప్రజల పక్షాన నిలబడి, సామాజిక చైతన్యాన్ని తన రచనల ద్వారా ప్రజల్లో నింపిన కాళోజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.కాళోజీ జయంతిని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం ఆయనకు అందిస్తున్న గొప్ప గౌరవమని తెలిపారు. యువత కాళోజీ సాహిత్యం, ఆయన ఆశయాలను అధ్యయనం చేసి సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె కిషోర్ కుమార్ అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,డి ఆర్వో విజయలక్ష్మి, డిపియార్వో ప్రేమలత కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పొరపాట్లకు తావివ్వొద్దు



**మొదటి పేజీ తరువాయి...**

వలస వెళ్లిన వారి పేర్లను నిబంధనల మేరకు గుర్తించి తొలగించాలని సూచించారు. బీఎల్ఓల వద్ద ఉన్న దరఖాస్తులు, ఓటర్ల జాబితాలను పరిశీలించిన సీఈఓ, కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాల్లో తప్పులు ఉంటే నిబంధనల ప్రకారం సరిచేయాలని సూచించారు. ఇంటింటి సర్వేలో ప్రతి కుటుంబంలోని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ధ్రువీకరించిన సమాచారం ఆధారంగానే మార్పులు, చేర్పులు, తొలగింపులు చేపట్టాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో డాక్యుమెంట్లను పరిశీలించి అవసరమైన వివరాలను సేకరిస్తున్నామని ఆయన తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. బీఎల్ఓలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఈఓ సూచించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన ప్రతి వివరాన్ని సమగ్రంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా అత్యంత కీలకమైనదని, ప్రతి దశలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని స్పష్టం చేశారు.

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఎస్ఐఆర్ ప్రక్రియను సీఈవోకి వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితాలో నమోదు కాకుండా దూరమవ్వకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, అనర్హుల పేర్లు కొనసాగకుండా నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఎస్పీ శ్రీనివాస్, ఆర్డీఓ దేవీదాస్, తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డల నిశ్శబ్ద నరకం !




**మొదటి పేజీ తరువాయి...**

అనుభవిస్తున్న నిశ్శబ్ద నరకాన్ని...!!

“ఒక దేశం ఎంత అభివృద్ధి చెందిందో తెలుసుకోవాలంటే, ఆ దేశంలో మహిళలు ఎంత ఆత్మగౌరవంతో బతుకుతున్నారో చూడాలి” అంటారు... కానీ మన బస్టాండ్లలో కంపుకొడుతున్న మరుగుదొడ్లు, అసలు బాత్రూమ్ లేకపోయినా పట్టించుకోని ప్రభుత్వాలు మన వ్యవస్థ ముఖచిత్రానికి పట్టిన చీడ...పసిపిల్లల ఆక్రందన...తల్లుల నిస్సహాయత

”అమ్మా... ఉచ్చొస్తోంది” అని ఆపుకోలేక విలవిలలాడుతూ ఏడ్చే పసిపాపను తీసుకుని ఆ తల్లి బస్టాండ్ లోకి పరిగెడితే... అక్కడ బాత్రూమ్ ఉండదు...ఒకవేళ ఉన్నా, ముక్కు పగిలిపోయే దుర్వాసన...వాంతులు వచ్చేంత అపరిశుభ్రత...ఆపుకోలేక ప్యాంటు తడుపుకున్న పసిబిడ్డ ఏడుస్తుంటే, చుట్టూ ఉన్న పది మంది చూపులకు ఆ తల్లి ప్రాణం అక్కడే సగం పోతుంది. గత్యంతరం లేక, బస్సు వెనుక భాగంలోనో, కూలిన గోడల చాటునో బిక్కుబిక్కుమంటూ ఆ చిన్నారిని కూర్చోబెడుతున్నప్పుడు... ఆ తల్లి గుండె ఎంత రగులుతుందో ఎవరైనా ఆలోచించారా...??

**ప్రాణాలు తీస్తున్న 'బిడియం'**

మగవాళ్లు రోడ్డు పక్కన ఎక్కడైనా సరే సిగ్గు వదిలేసి తమ పని ముగించుకోగలరు...కానీ ఒక ఆడది అలా చేయగలదా...?? ప్రకృతి సిద్ధమైన అవసరాన్ని బిగబట్టుకుని, అడుగు తీసి అడుగు వేయలేక, పెదవులు కొరుక్కుంటూ కడుపునొప్పితో గంటల తరబడి బస్సులో కూర్చునే ఆ ప్రయాణం...ఉచితం కాదు, అది ప్రాణసంకటం...రోజుకు ఎన్నో !!

గంటలు మూత్రం ఆపుకోవడం వల్ల కిడ్నీల మీద పడే భారం, మూత్రనాళాల ఇన్ఫెక్షన్లు మహిళల ఆయుష్షును హరిస్తున్నాయి...ఉచిత ప్రయాణంతో మిగిలిన పది రూపాయలు, లక్షల రూపాయల ఆసుపత్రి ఖర్చుల కింద మారుతున్నాయి...రాత్రి వేళల్లో ప్రయాణించే ఆడపిల్లలకు సరైన బాత్రూమ్స్ లేకపోవడం వల్ల ఆకతాయిల భయం, లైంగిక వేధింపుల ముప్పు పొంచి ఉంటోంది...!!

ఓటు అడగడానికి వచ్చే నాయకులకు మహిళలు దేవతలుగా కనిపిస్తారు...కానీ బస్టాండ్లలో కనీసం ఒక బాత్రూమ్ కట్టించాలన్న ఆలోచన ఎందుకు రాదు ఈ నాయకులకు...?? ఎందుకంటే, ఆడవాళ్ల కష్టం, వాళ్ల సిగ్గు, వాళ్ల ఆరోగ్యం మన సమాజానికి ఏనాడూ ప్రాధాన్యత కాదు కాబట్టి...!!

ఇకనైనా ఈ సమాజం కళ్లు తెరవాలి. మహిళలకు కావాల్సింది ఉచితాలు కాదు... లిఉచ్ఛ్వాస నిశ్వాసల్లాగే కాలకృత్యాలు తీర్చుకోవడం కూడా మనిషి ప్రాథమిక హక్కులి అని గుర్తించే వ్యవస్థ కావాలి... ప్రతి బస్టాండ్లో సురక్షితమైన, పరిశుభ్రమైన, నీటి వసతి ఉన్న మరుగుదొడ్లను నిర్మించిన రోజే... నిజమైన మహిళా సాధికారతకు మొదటి అడుగు పడినట్లు...!!

అది జరిగే వరకూ... మహిళలు చేస్తున్న ఈ ప్రయాణం కేవలం ఉచితం కాదు...వారి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్న ప్రయాణం..

# మాటిచ్చారు... నెరవేర్చండి

**మొదటి పేజీ తరువాయి...**

దృష్టికి తీసుకెళ్లినా, ఎలాంటి ఫలితం మాత్రం లేదన్నారు. ఇప్పటికైనా ఆరోగ్య పథకాన్ని అమలుచేసి జర్నలిస్టుల ప్రాణాలకు భరోసా కల్పించాలని ఆయన కోరారు.రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో, జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల మంజూరీలో కలెక్టర్లు తిరకాసులు పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వెంటనే అలాంటి వైఖరికి స్వస్తి పలికి కార్డులను మంజూరీ చేయాలని ఆయన డిమాండ్ చేసారు. ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ జర్నలిస్టుల పట్ల వ్యవహరిస్తున్న వైఖరిని ఆయన ఖండించారు. జిల్లాలో 15మంది జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడమే కాకుండా, వారికి మంజూరు అయిన అక్రెడిటేషన్ కార్డులను లాక్కోవడం సహించరానిదన్నారు. వెంటనే అక్రమ కేసులను





ఉపసంహారించుకోవాలని, లేనిపక్షంలో పోరాటం తప్పదని ఆయన హెచ్చరించారు. అలాగే జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అక్రెడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్న జర్నలిస్టులపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులతో విచారణ జరిపించడం సహించరానిదని విరాహత్ ఆందోళన వ్యక్తం చేసారు. ఈ ఇద్దరు అధికారుల వైఖరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన స్పష్టం చేసారు. జర్నలిజం వృత్తి పట్ల సమాజంలో విశ్వాసం సన్నగిల్లుతున్న నేటి పరిస్థితుల్లో, పవిత్రమైన మీడియా వృత్తికి పూర్వ వైభవం దక్కించేందుకు గాను నైతిక విలువలతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉంటుందని ఆయన సూచించారు. ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్ మాట్లాడుతూ, దశాబ్దాలుగా ఆదిలాబాద్ జిల్లాలో తమ సంఘం ఎంతో బలోపేతంగా ఉందని, అయితే సభ్యుల విశ్వాసాన్ని వమ్ము చేయకుండా జిల్లా నూతన కమిటీ చిత్తశుద్ధితో సేవలందించాలని ఆయన సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల రవీందర్, ప్రకాష్ రెడ్డి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్, రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం నాయకుడు హన్మంత్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్, కార్యదర్శి దేవేందర్ లతో పాటు జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న దాదాపు 200 మంది జర్నలిస్టులు హాజరయ్యారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## తెలంగాణ గర్వించదగ్గ మహనీయుడు

# కాళోజి నారాయణరావు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**అక్షిత బ్యూరో,మంచిర్యాల :** తెలంగాణ గర్వించదగ్గ మహనీయుడు కాళోజి నారాయణరావు అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు ల తో కలిసి హాజరై కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ప్రతి ఉద్యమం ప్రతిధ్వనిగా కాళోజి నారాయణరావు తెలంగాణ ప్రజలందరికీ సుపరిచితులని అన్నారు. తెలంగాణ వైతాళికుడిగా జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని, తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమమే ఊపిరిగా జీవించాడని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కాళోజీ జయంతి రోజున తెలంగాణ భాషా దినోత్సవంగా వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. విద్యార్థి దశలోనే నిజాంను ఎదిరించి తెలంగాణలో విద్యా వ్యాప్తికి కృషి చేశారని, తన రచనలతో ప్రజలను చైతన్య పరుస్తూ ఆదర్శంగా నిలిచారని అన్నారు. కాళోజీ నారాయణరావు బహు బాషా కోవిదులు అని, కవిగా, రచయితగా తెలుగుతో పాటు వివిధ భాషలలో హ్యూమన్ రైట్స్, కుల వివక్ష లేని సమాజంపై రచనలు చేశారని తెలిపారు. మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి దిశగా అందరూ సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు.



ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్ రావు దేశ్ పాండే, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గొంతుక కాళోజీ.. జయంతి వేడుకల్లో స్మరణ

### ప్రజాకవి కాళోజీకి ఘన నివాళులు అర్పించిన

### మండల ప్రజా పరిషత్ అధికారి యాదగిరి




**పటాన్‌చెరు అక్షిత ప్రతినిధి:** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ అధికారి యాదగిరి కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో యాదగిరి మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలంగాణ సాహిత్యానికి, ప్రజా చైతన్యానికి అందించిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ప్రజల సమస్యలను తన రచనల ద్వారా వెలుగులోకి తీసుకువచ్చిన కాళోజీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.కాళోజీ సాహిత్యం తెలంగాణ ప్రజల జీవన విధానాన్ని, వారి భావోద్వేగాలను ప్రతిబింబించిందని గుర్తుచేశారు. సమాజంలో చైతన్యం తీసుకురావడంలో ఆయన రచనలు కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు.ప్రజల పక్షాన నిలిచి, వారి సమస్యలను తన రచనల ద్వారా ప్రశ్నించిన కాళోజీ నారాయణరావు సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నాగేశ్వరరావు నాయక్, సూపరింటెండెంట్ వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్ అనంతరావు, జూనియర్ అసిస్టెంట్ రమాదేవి తో పాటు సిబ్బంది నరసింహ, తాహిర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ కార్యకర్తను పరామర్శించిన చిన్నంబావి మండల బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు



**చిన్నంబావి, అక్షిత న్యూస్:** చిన్నంబావి మండలం వెల్టూరు గ్రామానికి చెందిన నాగ మద్దిలేటి అనే భారత రాష్ట్ర సమితి కార్యకర్త గత కొన్ని రోజుల క్రితం బైకు ప్రమాదానికి గురై ఎడమ చెయ్యి ప్యాక్చర్ అయినది. అట్టి విషయం తెలుసుకొన్న చిన్నంబావి మండల భారత రాష్ట్ర సమితి నాయకులు కార్యకర్తలు బాధిత నాగమద్దిలేటి ఇంటి దగ్గరికి వెళ్లి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకుని ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకొని త్వరగా కోలుకొని బయటికి రావాలని ధైర్యం చెప్పారు. వడ్డేమాన్ రామకృష్ణుడు బాధితుడికి 3000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు అలాగే తగరం ఉగ్ర నరసింహ కూడా 5000 రూపాయలు నాగమద్దిలేటికి ఇచ్చి మేమున్నామని భరోసా కల్పించారు. నాగమద్దిలేటిని పరామర్శించిన వారిలో భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకులు స్వామి వడ్డేమాన్ రామకృష్ణుడు కేతపాగ సుధాకర్ సంకటి మద్దిలేటి, కత్తి నారాయణ ఉగ్ర నరసింహ బిసన్న హిట్లర్ నరసింహ తగరం నాగరాజు రవి, రాజేష్, తగరం కృష్ణ, తోళ్ల నాగేంద్రం తగరం శ్రీనివాస్, వెంకటేష్ మరియు తగరం నాగేష్ తదితరులు పరామర్శించారు.

## ఆచార్యులగూడెంలో అంగన్వాడి

# నూతన భవన శంకుస్థాపన

**చిలుకూరు, సెప్టెంబర్ 9 (అక్షిత న్యూస్):** మండల పరిధిలోని ఆచార్యుల గూడెంలో అంగన్వాడి నూతన భవన నిర్మాణానికి సర్పంచ్ బొడ్డుపల్లి లక్ష్మీ బిక్షం మరియు స్థల దాతలు మహాదాత శ్రీ మైలారిశెట్టి చిన్న యలమందయ్య , ధర్మపత్ని శ్రీమతి జానకమ్మ చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం చేయడం జరిగింది ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ యొక్క భవనా నికి 200 వందల గజాలు స్థలాన్ని దాతలుగా ఇచ్చినటువంటి చిన్నల మల్లయ్య జానకమ్మ లను అభినందించారు ఉదారంగా దానం చేయడం అభినందనీయం.వారి మహాదాన గుణానికి, సేవా స్ఫూర్తికి హృదయపూర్వక కృతజ్ఞతలు.ఈ స్థలంలో నేడు నూతన అంగన్వాడి భవనానికి శంకుస్థాపన జరగడం గ్రామ ప్రజలకు ఎంతో సంతోషకరమైన విషయం.స్థలం దానం

ఒక ఆస్తి దానం కాదు...ఎందరో చిన్నారుల భవిష్యత్తుకు వెలుగునిచ్చే మహాదానం అని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ, ఉపసర్పంచ్ నేమ్మాది వీరబాబు , 1వ వార్డు మెంబర్ అలవాల భాస్కర్, 3వ వార్డు మెంబర్ చింతరెడ్డి లక్ష్మారెడ్డి , 5వ వార్డు మెంబర్ వంగూరి కనకరత్నం సూర్యశీ, 8వ వార్డు మెంబర్ బొడ్డుపల్లి ధనలక్ష్మి లక్ష్మీనారాయణ , అంగన్వాడి సూపర్వైజర్ పొన్నం ఉపేంద్ర , గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాంబాబు , టీఆర్ఎస్ గ్రామ



శాఖ అధ్యక్షులు గట్టు వీరయ్య , గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చిలుకూరు మండలంలో డీజే సౌండ్ సిస్టమ్‌లకు అనుమతి లేదు

### ఎస్సై బండి మోహన్ బాబు

**చిలుకూరు, సెప్టెంబర్ 9 (అక్షిత న్యూస్):** మండలంలో ఉన్నటువంటి డీజే సౌండ్ సిస్టమ్ నిర్వాహకులతో ఎస్సై బండి మోహన్ బాబు మాట్లాడుతూ నిబంధనలు పాటించాలని గణేష్ నవరాత్రుల సందర్భంగా డీజేలకు అనుమతి లేదని, గణేష్ మండపం వద్ద డీజేలు పెట్టినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని డీజే నిర్వాహకులకు తెలియజేశారు.అదేవిధంగా డీజే వల్ల ప్రజలకు అధిక సౌండ్ వినిపించడం వల్ల చిన్నారులు, వృద్ధులు,




అనారోగ్యంతో ఉన్నవారికి ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని సూచించారు. వినాయక చవితి ఉత్సవాల్లో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం డీజే సౌండ్ సిస్టమ్ వినియోగంపై ఆంక్షలుఉన్నందున, మండపాల నిర్వాహకులు మరియు డీజే నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఇప్పటికే ఐదుగురుపై బైండవర్ కేసులు నమోదు అయ్యాయని ఆయన అన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక


# జర్నలిస్టుల ఇళ్లను అర్హులైన వారికి ఇవ్వాలి

**జర్నలిస్టులకు అండగా కాంగ్రెస్ సర్కార్**

**శాసనమండలిలో ప్రస్తావించిన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య**

**పలు సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్సీ**





**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ దేశాయిపేటలో జర్నలిస్టుల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను బీపీఎల్ కింద అర్హత కలిగిన తూర్పు జర్నలిస్టులకు కేటాయించాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య శాసనమండలిలో ప్రస్తావించారు. దేశాయిపేటలో జర్నలిస్టుల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పటికే సిద్ధంగా ఉన్నప్పటికీ, అర్హులైన జర్నలిస్టులకు అందకపోవడం పట్ల ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. బీపీఎల్ పరిధిలోని అర్హులైన జర్నలిస్టులను గుర్తించి ఇళ్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వారికోసమే స్థలం కేటాయించి నిర్మించిన ఇండ్లు వెంటనే వారికి అందజేయాలని గతం లో కూడా సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు మండలి చైర్మెన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై ఏదో ఒకటి తేల్చి సమస్య ను వెంటనే పరిష్కరించాలన్నారు.

జర్నలిస్టుల సంక్షేమం, వారి నివాస సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్సీ సారయ్య కోరారు.

**ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్సీ**

వరంగల్ జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న మిగిలి ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని చాలా కాలంగా పలు సమస్యలు మద్యలో ఆగి ఉన్నాయని వాటిని ప్రత్యేక దృష్టి సారించి పనులు పూర్తి చేసి ప్రారంభించి ప్రజల కు అందించాలని సీఎం ను కోరారు. సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి రాష్ట్ర రెండవ రాజధాని వరంగల్ ను అన్ని విధాలుగా పరిచేందుకు ప్రత్యేక దృష్టితో నిధులు కేటాయిస్తామని ఎమ్మెల్సీ కి సీఎం హామీ ఇచ్చారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ కూడా ఎమ్మెల్సీ వెంట ఉన్నారు.

## లక్ష్మీపల్లి గ్రామంలో ఘనంగా "జల్ సంకల్ప్--నీటి ప్రతిజ్ఞ"



**చిన్నంబావి, అక్షిత న్యూస్:** లక్ష్మీపల్లి గ్రామ సర్పంచ్ శ్రీమతి ఇటిక్యాల పెంటమ్మ ఆధ్వర్యంలో జల్ సంకల్ప్ -- నీటి ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇటిక్యాల పెంటమ్మ మాట్లాడుతూ... గ్రామ ప్రజలకు నీటి ప్రాముఖ్యత, నీటి పొదుపు, నీటి వనరుల పరిరక్షణ మరియు పరిశుభ్రమైన తాగునీటి వినియోగంపై అవగాహన కల్పించారు. నీరు ప్రతి ఒక్కరి జీవితానికి ఎంతో అవసరమైన వనరు అని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని గ్రామ ప్రజలకు సూచించారు. భవిష్యత్ తరాలకు నీటి కొరత రాకుండా ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని నీటి వనరులు, తాగునీటి సరఫరా వ్యవస్థ, పైపులైన్లు, కుళాయిలను సంరక్షిస్తూ నీటి వృథాను అరికట్టేందుకు గ్రామ ప్రజలందరూ కలిసి పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు. అధికారులను,వాటర్మెన్ ని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ డబ్ల్యూ ఎస్,ఏఈ విశ్వనాథ్, పంచాయతీ సెక్రటరీ శ్రీకాంత్, ఉపసర్పంచ్ మురళి, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. నీటిని కాపాడుదాం-భవిష్యత్ తరాలను కాపాడుదాం" అనే సందేశంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## విఘ్నేశ్వరుడి తరలింపుకు అడ్డుగా చిట్యాల రైల్వే బ్రిడ్జ్

**భారీ విగ్రహాల తరలింపులో ఇబ్బందులు..**

**బ్రిడ్జి కింద పరిమిత ఎత్తుతో వాహనదారుల అవస్థలు**




**చిట్యాల అక్షిత ప్రతి నిధి:** వినాయక నవరాత్రుల సందర్భంగా ప్రతిష్ఠించిన భారీ విఘ్నేశ్వరుడి విగ్రహాల నిమజ్జనం కోసం తరలింపు సమయంలో చిట్యాల రైల్వే బ్రిడ్జ్ అడ్డంకిగా మారుతోంది. బ్రిడ్జి కింద ఉన్న పరిమిత ఎత్తు కారణంగా పెద్ద విగ్రహాలను తరలించే వాహనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దీంతో నిర్వాహకులు, భక్తులు ఆందోళనకు గురవుతున్నారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా భారీ విగ్రహాలను ఊరేగింపుగా తరలించాల్సి ఉండగా, రైల్వే బ్రిడ్జి వద్ద వాహనాల ఎత్తు సరిపోకపోవడంతో ముందుకు వెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రత్యామ్నాయ మార్గం లేక పోవడంతో నిర్వాహకులు సమస్యను ఎదుర్కోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి బ్రిడ్జి వద్ద తగిన ఏర్పాట్లు చేసి, విగ్రహాల తరలింపుకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని భక్తులు, నిర్వాహకులు కోరుతున్నారు.

## బతుకమ్మ ఘాట్ నిర్మాణానికి భూమి పూజ



**మేడ్చల్, అక్షిత ప్రతినిధి:** అలియాబాద్ మున్సిపల్ కేంద్రం 10 లక్షల మున్సిపల్ జనరల్ నిధులతో నిర్మించనున్న బతుకమ్మ ఘాట్ నిర్మాణ పనులకు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కంఠం శిరీషా కృష్ణారెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ ఘాట్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి, రాబోయే బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చైర్ పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ కన్నెరెడ్డి మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్లు గదే వెంకటేష్, గూడే వెంకటేష్, వాడగం శ్యామ్, వంగరి దినేష్, మున్సిపల్ ఏఈఈ సనా షహీన్, తదితరులు పాల్గొన్నారు.

## కాళోజీ చూపిన బాటలో నడవాలి: జిల్లా కలెక్టర్ కె. హరిత

**ఘనంగా ప్రజాకవి 112వ జయంతి, తెలంగాణ భాషా దినోత్సవం**

**పర్యావరణహితంగా మట్టి గణపతులనే పూజిద్దాం: కలెక్టర్ పిలుపు**



**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:** ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన చూపిన మార్గంలో నడవాలని జిల్లా కలెక్టర్ కె. హరిత పిలుపునిచ్చారు. తెలంగాణ భాషా దినోత్సవం, కాళోజీ నారాయణరావు 112వ జయంతిని పురస్కరించుకుని బుధవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయ సమావేశ మందిరంలో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి, కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు తెలంగాణ భాషా దినోత్సవ, కాళోజీ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.

**పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత**

సమాజం పట్ల కాళోజీ చూపిన బాధ్యతాభావాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. రానున్న వినాయక చవితి పండుగను దృష్టిలో ఉంచుకుని ప్రజలంతా పర్యావరణహితమైన మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలని కోరారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీవోపీ) విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమవుతాయని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించేందుకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే పూజించాలని సూచించారు. అనంతరం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాలను అధికారులతో కలిసి పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మార్మాట్, రెవెన్యూ కలెక్టర్ డేవిడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ యాదవ్, కాలుష్య నియంత్రణ మండలి నోడల్ అధికారి భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, జడ్పీ సీఈవో, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి (బీసీడీవో) హైమద్, జిల్లా రవాణా శాఖ అధికారి, జిల్లా బాలల సంరక్షణ శాఖ అధికారి, ఇతర శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## జీవో 97 వెంటనే రద్దు చేయాలి

**నిరవధిక రిలే నిరాహార దీక్షలు ప్రారంభించిన వరంగల్ పాలిటెక్నిక్ విద్యార్థులు**

**ఇంజనీరింగ్ విద్యార్థులు క్రిమినల్ వేస్ట్ అనే భావన సరైనది కాదు**



**వరంగల్, అక్షిత బ్యూరో:** జీవో 97 రద్దు చేయాలని వరంగల్ పాలిటెక్నిక్ విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీవో 97 తీసుకువచ్చి పాలిటెక్నిక్, ఏటిసి, ఐటిఐ, విద్యను స్కిల్ ఇండియా యూనివర్సిటీ లో కలుపుతూ ఏఐసిటిఈ ద్వారా ఎస్బిటిఈటి నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీ లో కలపడం వల్ల విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అనేక అనుమానాలు ఉన్నాయని స్కిల్ ఇండియా యూనివర్సిటీలో కలపడం వల్ల లిశక్తిలి కార్యక్రమంలో విలీనం చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ విద్యార్థులు వ్యతిరేకిస్తూ దశల వారి ఉద్యమాలు చేపట్టారు. అందులో భాగంగా బుధవారం వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు కళాశాల ప్రాంగణంలోనే రిలే నిరాహార దీక్షలు చేపట్టి రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ అధికారులు జీవో 97ను వెనక్కి తీసుకునే వరకు దశల వారి ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇంజనీరింగ్ ఆశయంతో పాలిటెక్నిక్ విద్యకు వచ్చిన విద్యార్థులమని కార్మికులుగా మారి తమ ఆశలు ఆశయాలను కుదించుకోలేమని విద్యార్థులు తెలిపారు విద్యార్థులు లిక్రిమినల్ వెస్ట్లి అనే పదాన్ని ఎంత మాత్రం సహించేది లేదని అట్టడుగు పేద వర్గాలకు చెందిన విద్యలో అగ్రశ్రేణిగా ఉన్న విద్యార్థులు మాత్రమే పాలిటెక్నిక్ విద్యను ఎంచుకొని వచ్చారని లెటర్ ద్వారా సెకండ్ ఇయర్లో ప్రవేశం పొంది ఇంజనీరింగ్ చేసేందుకు అనేక సంవత్సరాల క్రితం నుంచి ఏర్పాటైన పాలిటెక్నిక్ విద్యను కొంతమంది స్వార్థం కోసం నిర్వీర్యం చేయరాదని విద్యార్థులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొని జీవో 97 రద్దు చేసేదాకా నిరంతరాయంగా రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



# కరీంనగర్‌లో ఘనంగా అస్మిత ఖేలో ఇండియా
# సిటీ లెవల్ రగ్బీ టోర్నమెంట్

**క్రీడలతో యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందుతుంది**

**నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు, ముఖ్యంగా బాలికలను క్రీడల వైపు ప్రోత్సహించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న "అస్మిత ఖేలో ఇండియా సిటీ లెవల్ రగ్బీ టోర్నమెంట్" కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై రగ్బీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించిన మేయర్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు.

మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. చదువుతో పాటు




క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో మంచి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.

మన ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు యువత, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఖేలో ఇండియా--అస్మిత వంటి కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని మేయర్ తెలిపారు. మట్టిలోని మాణిక్యాలను గుర్తించి వారికి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలతో పాటు అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఖేలో ఇండియా--అస్మిత వంటి కార్యక్రమాలను యువ క్రీడాకారులు, ముఖ్యంగా బాలికలు సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని మేయర్ ఆకాంక్షించారు.

కరీంనగర్ జిల్లాలో రగ్బీ క్రీడ అభివృద్ధికి రగ్బీ అసోసియేషన్ ఆఫ్ కరీంనగర్ జిల్లా చేస్తున్న కృషిని మేయర్ అభినందించారు. ఇటువంటి పోటీల నిర్వహణ ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులైన యువ క్రీడాకారులకు తమ ప్రతిభను నిరూపించుకునే మంచి వేదిక లభిస్తుందని అన్నారు.

ఈ టోర్నమెంట్‌లో వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ముఖ్యంగా బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం విశేషంగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ ఆఫ్ కరీంనగర్ జిల్లా జనరల్ సెక్రటరీ శివకృష్ణ, పెద్దపల్లి జిల్లా సెక్రటరీ రామకృష్ణ, సిద్దిపేట జిల్లా సెక్రటరీ అజయ్, రాజన్న సిరిసిల్ల జిల్లా సెక్రటరీ హనుమంతు, జగిత్యాల జిల్లా సెక్రటరీ మహిపాల్, వెంకటేశ్వర హాస్పిటల్ అడ్మిన్ వెంకటేశ్వర్లు, రగ్బీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

## అడవిదేవులపల్లిలో ఘనంగా ఛలో నకిరేకల్ జనసేన పోస్టర్ ఆవిష్కరణ



**అడవిదేవులపల్లి,అక్షిత ప్రతినిధి:** సెప్టెంబర్ 12న నకిరేకల్‌లో నిర్వహించనున్న జనసేన పార్టీ ఉమ్మడి నల్లగొండ పార్లమెంట్ స్థాయి ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలనే లక్ష్యంతో మంగళవారం అడవిదేవుల పల్లి బస్టాండ్ ప్రాంగణంలో ఛలో నకిరేకల్ జనసేన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.జనసేన పార్టీ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంచార్జ్ మేకల సతీష్ రెడ్డి సూచనల మేరకు మిర్యాలగూడ నియోజకవర్గ జనసేన నాయకులు కొట్ర గోవర్ధన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.జనసేన నాయకులు,జనసైనికులు,పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించి నకిరేకల్ సమావేశ ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కొట్ర గోవర్ధన్ మాట్లాడుతూ,నకిరేకల్‌లో జరిగే ఉమ్మడి నల్లగొండ పార్లమెంట్ స్థాయి ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశం పార్టీ సంస్థాగత బలోపేతానికి,కార్యకర్తల సమన్వయానికి కీలక వేదికగా నిలుస్తుందని అన్నారు.ప్రతి మండలం నుంచి జనసైనికులు,వీర మహిళలు భారీ సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు, కనకయ్య, ఆంజనేయులు,సైదా హుస్సేన్,తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## కళాప్రపూర్ణ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఘన నివాళి




**కరీంనగర్ అక్షిత బ్యూరో:** ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి తెలంగాణ భాషా దినోత్సవం పురస్కరించుకుని కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణ రావు తెలంగాణ సమాజానికి, తెలుగు సాహిత్యానికి చేసిన విశేష సేవలను కొనియాడారు. "అన్యాయాన్ని ఎదిరిస్తేనే మనిషి" అనే నినాదంతో ప్రజా చైతన్యాన్ని రగిలించిన మహనీయుడు కాళోజీ అని, ఆయన రచనలు, ఆలోచనలు సమాజానికి నిత్య ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ యాసకు, భాషకు కాళోజీ జీవం పోశారని, ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం ఎంతో గర్వకారణమని అన్నారు.

ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని కాళోజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

## అంగన్వాడీ టీచర్స్‌కు ఇంటర్వ్యూలు



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** మిర్యాలగూడ ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్నా అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ పోస్టులకు మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డిఓ ఎస్.రమణారెడ్డి అధ్యక్షతన ఇంటర్వ్యూలు నిర్వహించారు. మిర్యాలగూడ ప్రాజెక్టు పరిధిలో టీచర్ పోస్టులు 16 ఖాళీ ఉండగా వందల దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించిన అనంతరం 81 దరఖాస్తు దారులు అర్హులుగా నిర్ధారించారు. అదేవిధంగా హెల్పర్ 29 పోస్టులకు భారీగా దరఖాస్తులు రాగా పరిశీలన అనంతరం ఇంటర్వ్యూకు అర్హులైన అభ్యర్థులు 92 మంది అభ్యర్థులు వచ్చారు. అభ్యర్థులు ధృవీకరణ పత్రాలను ఐసిడిఎస్ సూపర్ వైజర్లు కె.నాగమణి, సిహెచ్ పద్మ, నజీమాబేగం మొహమ్మద్, శాంతి, బ్లాక్ కో ఆర్డినేటర్ కె.కవిత, సీనియర్ అసిస్టెంట్ రాములు పరిశీలించి ఇంటర్వ్యూలకు పంపారు. ఇంటర్వ్యూలు ఆర్డిఓ రమణారెడ్డితో పాటు సీడీపీఓ ఎం. వేణుగోపాల్ రావు, డిఎఓ శ్రీనివాస్ శర్మ తదితరులు నిర్వహించారు.

# ఆత్మకూరు మండల సర్వసభ్య సమావేశంలో
# గ్రామ సమస్యలపై సర్పంచుల గళం

**వివిధ శాఖల ప్రగతి నివేదికలు సమర్పించిన అధికారులు**

**గ్రామాల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సర్పంచుల విజ్ఞప్తి**

**సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన అధికారులు**




**ఆత్మకూరు, అక్షిత ప్రతినిధి :** ఆత్మకూరు మండల కేంద్రంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ శ్రీరామ్ రెడ్డితో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, మండల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశం ప్రారంభమైన అనంతరం వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రగతి నివేదికలను సమర్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి, ప్రభుత్వ పథకాల అమలు తీరు, ప్రజలకు అందుతున్న సేవలు, పెండింగ్‌లో ఉన్న పనులు తదితర అంశాలను అధికారులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

**గ్రామ సమస్యలపై సర్పంచుల ప్రస్తావన**

ఈ సందర్భంగా వివిధ గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ శ్రీరామ్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా తాగునీటి సమస్య, రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, విద్యుత్ సమస్యలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామీణ మౌలిక వసతులు తదితర సమస్యలపై చర్చించారు.

కొన్ని గ్రామాల్లో మంజూరైన అభివృద్ధి పనులు వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సర్పంచులు కోరారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామాల్లో ప్రాథమిక సౌకర్యాలను మరింత మెరుగుపర్చాలని అధికారులను కోరారు.

**సమన్వయంతో పనిచేయాలి**

సర్పంచులు ప్రస్తావించిన సమస్యలపై అధికారులు స్పందిస్తూ, సంబంధిత శాఖల పరిధిలో ఉన్న అంశాలను పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో పేర్కొన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖలు చొరవ చూపాలని సూచించారు.

**అభివృద్ధి పనులపై సమీక్ష**

సమావేశంలో గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించగా, సర్పంచులు స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను వివరించారు.

ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సర్పంచులు కోరారు. సమావేశంలో చర్చించిన అంశాలపై సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పాల్గొన్న అధికారులు స్పెషల్ ఆఫీసర్, నరేంద్ర కుమార్, ఎంపీడీవో శ్రీరామ్ రెడ్డి, ౹ాజూ చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి, ఎంపీ ఓ, ఘా,రాజు,హీూా, రమేష్ నాయక్, పి నరేష్ కుమార్ ౹ా=ణ,ణతీ. విజయ్ కుమార్, =. నర్సింలు. విద్యుత్, శ్రీనివాసులు వీజూా, ఫయాజ్ అహ్మద్, మెడికల్.. ఎస్ రాజ్యలక్ష్మి, రాజేశ్వరి హౌసింగ్, రామచంద్రయ్య =బొ, వంశీకృష్ణ, అటవీ శాఖ మరియు ఎక్సైజ్ శాఖ తదితర అధికారులు పాల్గొన్నారు

## తెలంగాణ భాషా యాసకు ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన ప్రజాకవి కాళోజీ

### మేయర్ కొలగాని శ్రీనివాస్

### కరీంనగర్‌లో కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలు



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ నగరంలోని రేకుర్తి 19వ డివిజన్‌లో ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు 112వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు విగ్రహానికి కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల జీవితాలను, వారి భావోద్వేగాలను, భాషా యాసను తన రచనల ద్వారా ఎలుగెత్తి చాటిన మహోన్నత ప్రజాకవి అని కొనియాడారు. తెలంగాణ భాషలోని మాధుర్యాన్ని, తెలంగాణ యాసలోని ప్రత్యేకతను తన సాహిత్యంతో ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి కాళోజీ అని అన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అసమానతలు, ప్రజా సమస్యలపై తన కలం ద్వారా నిరంతరం పోరాడిన కాళోజీ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. కాళోజీ ఆలోచనలు, రచనలు, ప్రజాస్వామ్య విలువలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని మేయర్ పిలుపునిచ్చారు. కాళోజీ నారాయణరావు వంటి మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మేయర్ అన్నారు.

ఈ కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ సుధగోని మాధవి కృష్ణ గౌడ్, కాళోజీ నగర్ కాలనీల అధ్యక్షులు రమణారెడ్డి, నారాయణరెడ్డితో పాటు పలువురు డివిజన్ నాయకులు, యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

## కాళోజీ సాహిత్యం.. ప్రజా చైతన్యానికి ప్రతీక...

### కలెక్టరేట్‌లో ఘనంగా జయంతి వేడుకలు

### అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు...



**నిర్మల్ అక్షిత ప్రతినిధి :** ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను బుధవారం నిర్మల్ కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ప్రజలకు అర్థమయ్యే తెలంగాణ యాసలో కవితలు రచించి ప్రజలను చైతన్యపరిచిన గొప్ప ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని కొనియాడారు. సాహిత్యం, ప్రజా చైతన్యానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా 1992లో కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారంతో సత్కరించిందని తెలిపారు. కాళోజీ జన్మదినాన్ని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. మహనీయుల జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం ద్వారా వారి సేవలు, ఆశయాలను భావితరాలకు తెలియజేసే అవకాశం కలుగుతుందని అన్నారు.

కార్యక్రమంలో డీఆర్వో రాథోడ్ రమేష్, బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారులు శ్రీనివాస్, దయానంద్, ఉద్యానశాఖ అధికారి రమణ, ఎల్‌డీఎం రామ్‌గోపాల్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### జడ్.పి.ఉన్నత పాఠశాల,పల్లె దవాఖాన, ప్రాథమిక పాఠశాల,

# అంగన్‌వాడీ కేంద్రాల ఆకస్మిక తనిఖీ

### పదో తరగతి విద్యార్థులు నిరంతరం సాధన చేసి గణితంపై పట్టు సాధించాలనీ సూచించిన కలెక్టర్



**మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి:** మూసాపేట మండలం వేముల గ్రామంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్.పి.హెచ్.ఎస్), పల్లె దవాఖాన, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. మొదట వేముల జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యాబోధన, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పాఠశాలలోని వసతులు, కొనసాగుతున్న నిర్మాణ పనులు, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు. స్టాఫ్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి ఉపాధ్యాయుల హాజరు వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు, మార్కుల నమోదును పరిశీలించారు. సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, విద్యార్థులకు అందిస్తున్న అక్షయపాత్ర భోజనాన్ని కూడా పరిశీలించారు.

పదవ తరగతి క్లాస్ రూమ్ ను సందర్శించి విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. సిలబస్ ఎంతవరకు పూర్తయింది, పాఠ్యాంశాల పురోగతి ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గణితంలోని సూత్రాలు, సమస్యల పరిష్కారంపై విద్యార్థులను ప్రశ్నించి వారి అవగాహనను పరీక్షించారు. గణితంలో మంచి మార్కులు సాధించాలంటే సూత్రాలను కేవలం



గుర్తుపెట్టుకోవడం కాకుండా వాటిని క్రమం తప్పకుండా సాధన చేయాలని సూచించారు. సమస్యలను స్వయంగా పరిష్కరిస్తూ గణితంపై పూర్తి పట్టు సాధిస్తే ఎస్.ఎస్.సి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించవచ్చని తెలిపారు.

పాఠశాల విద్యార్థిని కుమారి మాధురి రచించిన 'శతక మధురిమ' పుస్తకాన్ని కలెక్టర్ పరిశీలించి ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల పనితీరును కూడా ప్రశంసించారు. పీఎం శ్రీ పాఠశాలగా ఎంపికైనందున కేటాయించిన నిధులు, వాటి వినియోగం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమీపంలోని ఫ్యాక్టరీల యాజమాన్యాల సహకారంతో సి.ఎస్.ఆర్ నిధుల ద్వారా పాఠశాల అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో ఎదగాలని కలెక్టర్ సూచించారు.

**పల్లె దవాఖాన తనిఖీ**

అనంతరం పల్లె దవాఖానను సందర్శించిన కలెక్టర్ అక్కడికి వచ్చే రోగుల సంఖ్య, సాధారణంగా నమోదవుతున్న అనారోగ్య సమస్యలు, ప్రజలకు అందుతున్న వైద్య సేవల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు అందిస్తున్న కాల్షియం మాత్రలు, ఇతర మందుల నిల్వలను పరిశీలించారు.

గ్రామంలోని స్థానికులతో కూడా కలెక్టర్ మాట్లాడి ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, గ్రామ పరిస్థితులు, పాఠశాల పనితీరుపై వివరాలను తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సమర్థవంతంగా పనిచేస్తున్నారని స్థానికులు కలెక్టర్‌కు తెలిపారు.

**ప్రాథమిక పాఠశాలను సందర్శన కలెక్టర్**

తదుపరి వేముల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా అక్కడ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యత, మెనూ అమలు తీరుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

**అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్**

వేముల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం చిన్నారులకు ఆహారం అందిస్తున్నారా లేదా పరిశీలించారు. ఈ రోజు మెనూలో 'ఎగ్ బిర్యానీ' ఉన్నప్పటికీ, బియ్యం వండి దానిపై గుడ్డు వేసి అందించినట్లు గుర్తించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారం సిద్ధం చేయకపోవడంపై సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.కలెక్టర్ వెంట మండల,గ్రామ అధికారులు ఉన్నారు

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

### విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి..

### విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు..

### చౌటుప్పల్ సిఐ జి. మన్మథ కుమార్



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** రహదారి పైకి వచ్చే ప్రతి పౌరుడు తప్పక రోడ్డు భద్రత నియమాలను పాటించాలని చౌటుప్పల్ సిఐ జి మన్మథకుమార్ అన్నారు. బుధవారం రోడ్ సేఫ్టీ, యాంటీ డ్రగ్ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని అరబిందో జూనియర్ కాలేజ్ సమీపంలో సిఐ జి మన్మథ కుమార్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత, యాంటీ డ్రగ్ అవేర్నెస్ కార్యక్రమమును నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, అతివేగం వల్ల కలిగే ప్రమాదాలపై విద్యార్థులకు సీఐ అవగాహన కల్పించారు. రహదారి భద్రత నియమాలను పాటించి ప్రతి ఒక్కరు క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. రహదారి ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్న వారిలో ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తుందన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు.అలాగే మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాల్సిన అవసరం, యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి, రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఇన్స్పెక్టర్ జి. మన్మథ కుమార్ సూచించారు. రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, చక్కగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్,అధ్యాపక బృందం, విద్యార్థులు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చౌటుప్పల్‌లో రోడ్డు దాటడం అంటే ప్రాణాలతో చెలగాటమే..!

### చౌటుప్పల్‌లో నత్త నడకన రోడ్డు విస్తరణ పనులు...

### పాదాచారులకు...భద్రత ఏది?

### దసరా,సంక్రాంతికి పండుగలకు తిప్పలు తప్పవా...!

### పాదాచారులకు,ద్విచక్ర వాహనదారులకు డ్రైనేజీ పై స్లాబ్ లే దిక్కు...

### నిత్యం ట్రాఫిక్ తో ప్రయాణికులు,వాహనదారులు తీవ్ర ఇబ్బందులు....





**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** యాదాద్రి జిల్లా,చౌటుప్పల్ లో జాతీయ రహదారిపై రోడ్డు విస్తరణలో భాగంగా చేపడుతున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్త నడకన సాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.చౌటుప్పల్ లో ట్రాఫిక్ సమస్యతో రోడ్డు దాటడం అనేది పాదాచారులకు, ప్రయాణికులకు దినదిన గండంగా మారింది. రహదారులపై పాదాచారుల భద్రత అత్యంత ప్రమాదకరంగా మారింది. పెరుగుతున్న వాహనాల వేగం, అస్తవ్యస్తమైన రోడ్ల నిర్మాణంతో పాదాచారుల ప్రాణాలు గాల్లో దీపంలా మారుతున్నాయి. ప్రయాణికులు, విద్యార్థులు,వృద్దులు నడిచే దారి లేక తప్పని పరిస్థితుల్లో డ్రైనేజీలపై వేసిన స్లాబ్ లనే ఫుట్ ఫాత్ లుగా చేసుకొని వాటిపై నడవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు వాపోతున్నారు . చౌటుప్పల్ లోని ప్రధాన కూడళ్ళ లో రోడ్డు దాటడానికి ఎటువంటి సౌకర్యాలు లేకపోవడం వల్ల పాదాచారులు నిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

**పాదాచారులకు భద్రత కరువు...**

ఒకపక్క జాతీయ రోడ్డు విస్తరణ బ్రిడ్జి పనులు జరుగుతున్న వాహనదారులు అవేమి పట్టించుకోకుండా మితిమీరిన వేగంతో హైవేకు రెండు వైపులా సర్వీస్ రోడ్లపై వాహనదారులు అతివేగంగా దూసుకు వెళుతుండడంతో ప్రయాణికులు ప్రాణ భయంతో రోడ్డుకు ఇరువైపులా వేసిన డ్రైనేజి స్లాబ్ పై విధిలేక నడవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులు ఉన్న దుకాణాలకు వచ్చిపోయే కొనుగోలుదారులు, వ్యాపారస్తులు కూడా వాహనాలను డ్రైనేజీస్లాబ్ పై పార్కింగ్ చేయడంతో దానిపై కూడా నడవడానికి ఇబ్బందులు పడవలసి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. అంతేకాకుండా దానిపై కూడా విధిలేక ద్విచక్ర వాహనదారులు కూడా రాకపోకలు సాగిస్తుండడం తో పాదాచారులకు భద్రత కరువైంది.బస్టాండ్ కు ఇరువైపులకు రోడ్డు దాటడానికి ప్రయత్నించే ప్రయాణికులు,పాదాచారులు, విద్యార్థులు, వృద్ధులు ప్రాణాలు అరచేతుల పెట్టుకొని వాహనాల రాకపోకలను తప్పించుకొని వెళ్లడం ఒక పద్మవ్యూహం లాగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు,కళాశాలకు వెళ్లే విద్యార్థులు నిత్యం రోడ్డు దాటలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోడ్డు విస్తరణ పనులు జరిగే చోట వాహనాల వేగాన్ని నియంత్రించడానికి ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**దసరా, సంక్రాంతి పండుగలకు తిప్పలు తప్పవా..?**

చౌటుప్పల్ లో మట్టి బ్రిడ్జి నిర్మాణ పనులు నత్త నడకన నడుస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో పెరుగుతున్న ట్రాఫిక్ వాహనదారులకు అనుగుణంగా రోడ్ల నిర్మాణం, విస్తరణ,కొత్త ఫ్లైఓవర్ నిర్మిస్తున్నప్పటికీ భద్రత చర్యలకు సంబంధించి మాత్రం ఆ దిశగా అడుగులు పడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాఖీ పండుగకు ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక రానున్న దసరా, సంక్రాంతి పండుగలకు ట్రాఫిక్ సమస్య ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది.

**వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు...**

చౌటుప్పల్ మండలం ధర్మోజీగూడెం వద్ద,చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జాతీయ రహదారి రోడ్డు విస్తరణ, ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు నెమ్మదిగా కొనసాగుతున్నందు వల్ల రహదారిపై రాకపోకలకు తీవ్రతరాయం ఏర్పడి వాహనాలను ఇరువైపులు ఉన్న సర్వీస్ రోడ్లు మీదుగా పంపించడం వలన సర్వీస్ రోడ్లపై వాహనాల రద్దీ విపరీతంగా పెరగడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతు నాయి. ముఖ్యంగా వారాంతరపు సెలవు దినాలలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండి ట్రాఫిక్ లో ప్రయాణికులు, పాదాచారులు చిక్కుకొని బిక్కుబిక్కుమంటూ రోడ్డు దాటాల్సి వస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వాహన దారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులు వేగవంతముగా చూడాలని ప్రజాప్రతినిధులను, అధికారులను ప్రజలు కోరుతున్నారు. అలాగే ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ నియంత్రణకు కూడా పోలీస్ యంత్రాంగం తగిన చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, వ్యాపారస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# వీబీజీ రామ్‌జీ పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు

### మౌలిక వసతుల అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇవ్వాలి

### అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



**వనపర్తి అక్షిత ప్రతినిధి:** వీబీజీ రామ్‌జీ పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పేర్కొన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలం రాయినిపేట గ్రామపంచాయతీ పరిధిలో చేపడుతున్న వీబీజీ రామ్‌జీ పనులు, తెలంగాణ జలసిరి నీటి కుంట (ఫార్మ్ పాండ్) పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సంబంధిత అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నీటి కుంటల పనులను నిర్దేశిత ప్రణాళిక ప్రకారం చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని అధికారులకు సూచించారు. తెలంగాణ జలసిరి కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, రైతులకు సాగునీటి లభ్యత మెరుగు పడేలా ఫారం పాండ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఫారం పాండ్ పనులను నాణ్యతతో పూర్తి చేసి, వాటి ద్వారా రైతులకు గరిష్ట ప్రయోజనం చేకూరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వీబీజీ రామ్‌జీ పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. డి ఆర్ డి ఓ రామ మహేశ్వర్ రెడ్డి, ఎంపీడీవో వినీత్, ఎపివో రాములు తదితరులు ఉన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు

### మాజీ దేవస్థాన చైర్మన్ ముత్యాల కిష్టయ్య



**చేర్యాల అక్షిత ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌పై గడ్డం ప్రసాద్ ని కొందరు చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలను కొమురవెల్లి దేవస్థాన మాజీ చైర్మన్ ముత్యాల కిష్టయ్య తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా బుధవారం చేర్యాల మీడియాతో ఆయనమాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ స్పీకర్ పదవికి ఎంతో గౌరవం, ప్రత్యేక స్థానం ఉందని ఆయన అన్నారు. ఆ పదవిని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలను, శాసనసభ గౌరవాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు. రాజకీయ భేదాభిప్రాయాలు సహజమే అయినప్పటికీ, వ్యక్తిగత విమర్శలు, అసభ్యకరమైన మరియు అనుచిత వ్యాఖ్యలకు తావివ్వడం సరికాదన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకం ఉన్న ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని,రాజ్యాంగబద్ధమైన పదవులను గౌరవించాలని ముత్యాల కిష్టయ్య బలమైన విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇలాంటి అనుచిత వ్యాఖ్యలకు ఎవరూ పాల్పడకుండా, రాజకీయాల్లో హుందాతనం, సంయమనం, పరస్పర గౌరవం పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ లు పచ్చిమట్ల సతీష్, చెవిటి లింగం,ముత్యాల తార యాదగిరి,కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, జనగామ నియోజకవర్గం సోషల్ మీడియా కో కన్వీనర్ తాటికొండ సదానందం,చేర్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి నీలం సన్నీ, చేర్యాల కొమ్మూరి యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో తెలంగాణ ఉద్యమ కారుడు

### ఖమ్మం జిల్లా వాసి పిండిగ వెంకన్న ఏ తెలంగాణ వెంకన్న

**ఖమ్మం /అక్షిత బ్యూరో :** ఉమ్మడి ఖమ్మం నల్గొండ వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా తెలంగాణ ఉద్యమ కారుడు పిండిగ వెంకన్న అలియాస్ తెలంగాణ వెంకన్న పోటీ చేస్తారు అని ప్రచారం జరుగుతోంది. తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న పిండిగ వెంకన్న అలియాస్ తెలంగాణ వెంకన్న ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కు చెందిన వారు. మలిదశ ఉద్యమంలో కీలకమైన తెలంగాణ విద్యా వంతుల వేదిక తెలంగాణ జేఏసీ సంస్థల్లో వెంకన్న ఉద్యమ కార్యకర్తగా క్షేత్ర స్థాయిలో కీలకంగా పని చేశారు. తెలంగాణ సాధన అనంతరం ఏర్పడిన తెలంగాణ వికాస సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. సామాజిక ఉద్యమాలకు మద్దతుగా తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ ఈబీసీ జేఏసీ కన్వీనర్ గా ప్రస్తుతం కొనసాగుతున్నారు. పిండిగ వెంకన్న పూర్వీకులది ఉమ్మడి నల్గొండ జిల్లా సూర్యాపేట సమీపంలోని కుడకుడ ప్రాంతం కావడంతో ఆ జిల్లా పట్టభద్రుల మద్దతు దొరికే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. మలిదశ ఉద్యమంలో భాగంగా తెలంగాణ విద్యా వంతుల వేదికలో పని చేస్తున్న కాలంలో ఉద్యమ భావజాలం వ్యాప్తి కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. తెలంగాణ ఉద్యమంలో అత్యంత కీలకమైన రెండు ఉద్యమ సంస్థలు అయిన తెలంగాణ విద్యా వంతుల వేదిక తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీలో క్రియాశీలకంగా పాల్గొన్న కారణంగా ఉమ్మడి నల్గొండ ఖమ్మం వరంగల్ జిల్లాల ఉద్యమ కారులతో వెంకన్నకు ఉద్యమ నేపథ్యంతో పాటు వ్యక్తి గతంగా కూడా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఉమ్మడి మూడు జిల్లాలకు చెందిన ఉద్యమ సంస్థలు సుఘాలు ప్రజా సంఘాలతో వెంకన్నకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పరిచయాలు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం విద్యావంతులు బుద్ధి జీవులతో ఏర్పాటు చేసిన తెలంగాణ వికాస సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా మూడు జిల్లాల్లో జరిగిన కార్యక్రమాల్లో వెంకన్న క్రియాశీలకంగా పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమం లక్ష్యంగా 2022 లో తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి ఏర్పాటు చేసి ప్రస్తుతం ఈ సంస్థకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి అధికారికంగా రిజిస్టర్ నెంబర్ 353/2022 ద్వారా ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు.



సామాజిక ఉద్యమాలకు మద్దతుగా తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ ఈబీసీ జేఏసీ ఏర్పాటు చేసి రాష్ట్ర కన్వీనర్ గా ఉన్నారు. తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడుగా రూబీ స్టీవెన్ సన్ ప్రధాన కార్యదర్శిగా పిండిగ వెంకన్న లు గత కొంత కాలంగా ఉద్యమ కారుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారు. ఆ క్రమంలోనే రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న పిండిగ వెంకన్న కు తెలంగాణ ప్రభుత్వం నుంచి అధికారికంగా ఉద్యమ కారులకు ఇచ్చే 250 గజాల ఇంటి స్థలం ఇతర సంక్షేమం గురించి వెంకన్నకు రిప్లై లెటర్ రావడం జరిగింది.

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కేకే కమిటీ సమావేశంలో పిండిగ వెంకన్న పాల్గొని ఉద్యమ కారుల ఆకాంక్షను హక్కులను స్పష్టం చేశారు. పిండిగ వెంకన్న నేటి వరకు ఏ పార్టీలో కూడా సాధారణ సభ్యత్వం కూడా తీసుకోలేదు పూర్తిగా రాజకీయాలకు అతీతంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు అని సమాచారం.

## యూరియా సకాలంలో అందించాలి

**ఎంఏఓ బుష్యేంద్రమణి**



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** ప్రస్తుతం రైతులు రెండవ దశ (సెకండ్ డోస్) యూరియా కోసం అడుగుతున్నందున, అన్ని పాక్స్, ఎన్డిసిఎంఎస్, ఎఫ్పిఒ ప్రైవేట్ ఎరువుల డీలర్లు ముందుగానే యూరియా స్టాక్ ఏర్పాటు చేసుకొని, రైతులకు సకాలంలో అందే విధంగా చర్యలు తీసుకోవాలని డీలర్లను కోరినట్టు మండల వ్యవసాయాధికారి (ఎంఏఓ) ఎం. బుష్యేంద్రమణి అన్నారు. గురువారం వెంకటరమణ ఏజెన్సీస్ ను తనిఖీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్డి సిఎంఎస్, పాక్స్, ఎఫ్పీఓలు తమకు కేటాయించిన యూరియా కోసం అవసర పేమెంట్ పూర్తి చేసి, యూరియా స్టాక్ తెప్పించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. యూరియా పంపిణీ జరగనున్న పాక్స్, ఎన్డిసిఎంఎస్ ప్రైవేట్ ఎరువుల దుకాణాల వివరాలను ఒక రోజు ముందుగానే తెలియజేయాలన్నారు. తద్వారా క్షేత్రస్థాయిలో రైతులకు ముందస్తు సమాచారం అందించి, సంబంధిత కేంద్రాలకు మార్గనిర్దేశం చేయడం సాధ్యమవుతుందన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా అందుబాటులో ఉన్న స్టాక్‌ను సకాలంలో పంపిణీ చేయాలన్నారు. రైతులకు యూరియా కొరత లేకుండా అందుబాటులో ఉంచడం అందరి బాధ్యత అని ఆమె అన్నారు.

## పేదలకు సీఎం సహాయనిధి భరోసా

**టీపీసీసీ సభ్యులు రంజిత్‌రెడ్డి**

**నెక్కొండలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**



**నర్సంపేట అక్షిత ప్రతినిధి :** అనారోగ్యంతో కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుని ఆర్థికంగా నష్టపోయిన పేదలకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోందని నర్సంపేట నియోజకవర్గ టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ విశ్రాంతి గృహంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నేతృత్వంలో నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. వైద్య ఖర్చులతో పేదలు నిరాశ చెందవద్దని, ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. కష్టకాలంలో ఆర్థిక సాయం అందడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు సంపంగి తిరుపతయ్యకు రూ.96,000, దుగ్గి భాస్కర్‌రెడ్డికి రూ.50,500, దేశబోయిన ఆశయ్యకు రూ.20,000, ఎండీ చాందుకు రూ.12,000 విలువైన చెక్కులను అందజేశారు.

ఈ కార్యక్రమంలో నెక్కొండ గ్రామ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, పట్టణ అధ్యక్షులు ఇదునూరి సాయికృష్ణ, సొసైటీ డైరెక్టర్, మండల కాంగ్రెస్ కోశాధికారి కేవీ సుబ్బారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోడ శ్రీకాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు ముందస్తు ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** ఖరీఫ్ 2026-27 సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు కొరకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా పౌర సరఫరాల అధికారి, జిల్లా మేనేజర్, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన మౌలిక వసతులను ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు. జిల్లాలో ధాన్యం నిల్వకు అవసరమైన గోదాములను వెంటనే గుర్తించి సిద్ధంగా ఉండాలన్నారు. సంబంధిత ఏజెన్సీ లతో ముందస్తు సమావేశాలు నిర్వహించి సమర్థ కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎట్టి పరిస్థితులలోనూ లోతట్టు ప్రాంతాలలో ఏర్పాటు చేయరాదని, ఎత్తైన,చదును ప్రదేశాలను ఎంపిక చేయాలని తెలిపారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చుకొని అక్టోబర్ 1వ తేదీ నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన అనంతరం సంబంధిత వివరాలను ఆన్‌లైన్ లో నమోదు చేసి, అందులో కేటాయించిన 16 ప్రశ్నలకు సంబంధించిన నిజ సమయం తెలిపే ఫోటోలను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని తెలిపారు. గత సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం, గన్నీ సంచుల లెక్కలు సరిచూడటం ప్రక్రియను సంబంధిత కొనుగోలు ఏజెన్సీలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గత సీజన్‌కు సంబంధించిన లెక్కలు పూర్తిగా సరిచేసిన తర్వాతే తదుపరి సీజన్‌కు సంబంధించిన అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. వానాకాలం 2026-27 సీజన్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని, ధాన్యం రవాణాకు సంబంధించిన వాహన వివరాలు, గన్నీ సంచుల నిల్వ, ధాన్యం రవాణా చేసే లారీలకు ప్రణాళిక సిద్ధం చేయడంతో పాటు నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలని అన్నారు. రైతులకు సకాలంలో, పారదర్శకంగా ధాన్యం కొనుగోలు సేవలు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ అధికారులు, కొనుగోలు ఏజెన్సీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాళోజీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

**మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ**



**మందమర్రి, అక్షిత ప్రతినిధి:** మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలో ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జీఎం ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తన కలం, గళంతో తెలంగాణ ప్రజా చైతన్యానికి, భాషా వికాసానికి దిశానిర్దేశం చేశారని కొనియాడారు. కాళోజీ జయంతిని తెలంగాణ ప్రభుత్వం 'తెలంగాణ భాషా దినోత్సవం'గా నిర్వహించడం గర్వకారణమన్నారు.పుట్టుక నీది చావు నీది బతుకంతా దేశానిది అని చాటిచెప్పిన కాళోజీ సిద్ధాంతాలు, ఆయన పాటించిన విలువలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కాళోజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం జి.ఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ జీఎం స్ట్రక్చర్ కమిటీ సభ్యులు సి.వి. రమణ, సీఎంఓఏఐ జాయింట్ సెక్రటరీ రవి, ఏరియా ఈఅండ్‌ఎం ఏజీఎం బాలాజీ భగవతిజ, కేకే ఏజెంట్ ఖదీర్, శాంతిఖని ఏజెంట్ సంతోష్ కుమార్, కేకేఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాంబాబు, డీజీఎం (పర్సనల్) సిహెచ్. అశోక్, సీనియర్ పీఓ ఆర్. సత్యనారాయణతో పాటు ఏరియా ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధిపతులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు సేవలను స్మరించుకున్నారు.

## కోర్టు నూతన భవన నిర్మాణానికి పరిపాలన అనుమతులు

**ఆదర్శ పాఠశాల, కళాశాల సమీపంలో 5 ఎకరాల్లో నిర్మాణం**

**రెండు నెలల్లో టెండర్ ప్రక్రియ పూర్తి..**

**బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడూరు పరమేష్**



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** యాదాద్రి జిల్లా,చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో నూతన కోర్టు భవన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయని చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడూరు పరమేష్ తెలిపారు. ఈ మేరకు స్థానిక కోర్టు ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... లక్కారం పరిధిలోని ఆదర్శ పాఠశాల, కళాశాల సమీపంలో ఉన్న సర్వే నెంబర్ 50లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో అధునాతన హంగులతో నూతన కోర్టు భవనాన్ని నిర్మించనున్నట్లు వెల్లడించారు. భవన నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ రాబోయే రెండు నెలల్లోగా పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు. వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామిక ప్రాంతమైన చౌటుప్పల్ ప్రజల న్యాయ అవసరాలను దృష్టిలో ఉంచుకొని, భవిష్యత్తులో ఇక్కడ ఇండస్ట్రియల్ కోర్టుతో పాటు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తామని పరమేష్ పేర్కొన్నారు.ఈ అనుమతుల సాధనలో సహకరించిన రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే అడిషనల్ కోర్టు భవన సాధనకు కృషి చేసిన బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఎలమోని శ్రీనివాస్, ఉడుగు శ్రీనివాస్ గౌడ్, బాల్యం వెంకట చలపతిలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. భవన నిర్మాణ అనుమతులు లభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జూనియర్ ఇన్‌చార్జి సివిల్ జడ్జి శిరీష, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పరస్పరం స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. నిరంతరం శ్రమించి అనుమతులు సాధించిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడూరి పరమేష్‌ను న్యాయవాదులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పడమటి మహిపాల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పిట్టల భిక్షం, జాయింట్ సెక్రటరీ మక్తాల నరసింహ, కోశాధికారి స్వాతి, లైబ్రరీ సెక్రెటరీ నర్రి స్వామి, సీనియర్ న్యాయవాదులు ముత్యాల సత్తిరెడ్డి, రాపోలు వేణు, చామట్ల జంగయ్య, జిల్లా రమేష్, దేశబోయిన శ్రీశైలం, మహమ్మద్ ఖయ్యూం, కిరణ్, నకిరేకంటి జ్యోతి, పిట్టల భరత్ తదితరులు పాల్గొన్నారు.